కుత్బుల్లాపూర్ మొత్తం ఓటర్లు 6,99,130 మంది

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 6 లక్షల 99 వేల 130 మందికి చేరుకుంది. 2019 పార్లమెంట్ ఎన్నికల సమయంలో 5,16,089 మంది ఓటర్లు ఉండగా, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కొత్త ఓటర్ నమోదుకు అక్టోబరు 31వ తేదీ వరకు అవకాశం కల్పించారు. గతంలో ఓటు హక్కు కోల్పోయిన వారితో పాటు 18 ఏళ్లు నిండిన 16,279 మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. దీంతో 29వేల 777 మందిని అర్హులుగా గుర్తించి తుది జాబితాలో చేర్చడంతో 6,99,130 కు ఓటర్లు పెరిగారు. వీరిలో మహిళా ఓటర్లు 3 లక్షల 17 వేల 844 మంది, పురుషులు 3 లక్షల 51 వేల 356 మంది, ట్రాన్స్ జెండర్లు 153 మంది ఉన్నారు.

అధిక శాతం ఓటింగ్‌కు కృషి చేస్తాం

ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు



కుత్బుల్లాపూర్: పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల భద్రత విషయంపై కుత్బుల్లాపూర్ ఎన్నికల అధికారి పులి సైదులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 590 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 41 మంది సెక్టర్ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. 1548 పోలింగ్ ఆఫీసర్లతో పాటు 1356 ప్రొసీడింగ్, అసిస్టెంట్ ప్రొసీడింగ్ సిబ్బందిని నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎక్కడ ఎలాంటి సంఘటనలు జరగకుండా పూర్తి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అధిక శాతం ఓటింగ్ నమోదు అయ్యేలా చూస్తామన్నారు. రాజకీయ పక్ష నాయకులు పోలింగ్ కేంద్రానికి దూరంగా ఉండాలన్నారు. ఎటువంటి ప్రచారాలు చేయొద్దని.. ఓటింగ్‌కు వచ్చేవారిని ఇబ్బందులు పెట్టకూడదని పులి సైదులు సూచించారు.

సమస్యలను అసెంబ్లీలో గళమెత్తుతా..

- హెల్మెట్ గుర్తుకు ఓటేసి గెలిపించండి
- కుత్బుల్లాపూర్ స్వతంత్ర అభ్యర్థి సాయికుమార్



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న స్వతంత్ర అభ్యర్థి సాయికుమార్

కుత్బుల్లాపూర్: స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి సాయికుమార్ పంతులా తనదైన శైలిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. హెల్మెట్ గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని, స్థానిక సమస్యలను అసెంబ్లీలో గళమెత్తి వినిపించి వాటిని పరిష్కరించేందుకు తనకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. హెల్మెట్ వాహనదారుల భద్రతకు ఎంత ముఖ్యమో.. తాను ఈ ప్రాంత ప్రజలకు రక్షణ కవచంగా ఉండి అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు అన్ని వేళలా అందుబాటులో ఉంటానన్నారు. నిరుద్యోగులు, పేదల సమస్యలపై పోరాడే తనకు మద్దతు ఇవ్వాలని సాయికుమార్ కోరుతున్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి తాను కృషి చేస్తానని పేర్కొంటున్నారు.

ప్రతిభాపాటవాలు పెంపొందించుకోవాలి

- డీఆర్‌డీఓ శాస్త్రవేత్త రాజబాబు
- ఘనంగా వీజేఐఎం స్నాతకోత్సవం



వీజేఐఎం కళాశాల విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న డీఆర్‌డీఓ శాత్రవేత్త రాజబాబు, కళాశాల ప్రెసిడెంట్ దగ్గుబాటి సురేష్‌బాబు

నిజాంపేట్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే శక్తి వంచన లేకుండా ఎప్పటికప్పుడు తమ ప్రతిభాపాటవాలను పెంపొందించుకోవాలని డీఆర్‌డీఓ శాస్త్రవేత్త, మిస్సైల్స్ అండ్ స్ట్రాటిజిక్ సిస్టమ్స్ డైరెక్టర్ జనరల్ రాజబాబు అన్నారు. శుక్రవారం బాచుపల్లిలోని విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (వీజేఐఎం) 29వ స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజబాబు, కళాశాల ప్రెసిడెంట్ దగ్గుబాటి సురేష్‌బాబుతో కలిసి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు పట్టాలు, ప్రశంస పత్రాలు అందజేశారు.

◆ ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోనే టాప్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలల్లో వీజేఐఎం ఒకటని అన్నారు. పట్టాలు పొందిన విద్యార్థులు మంచి ఉద్యోగావకాశాలు పొంది తల్లిదండ్రులకు, విద్యనభ్యసించిన కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తేవాలని అభిలాషించారు.

◆ ఈ కార్యక్రమానికి హాజరైన ఐఐఎం అహ్మదాబాద్ ప్రొఫెసర్ విశాల్ గుప్తా, వీజేఐఎం డైరెక్టర్ పి.శ్రీనివాససుబ్బారావు మాట్లాడుతూ... విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. మార్కెట్‌లో చోటు చేసుకుంటున్న సాంకేతిక అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కొత్త అవకాశాలను అంది పుచ్చుకున్నప్పుడే అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లగలుగుతామని పేర్కొన్నారు.

మహీంద్రా స్పోర్ట్స్ ఫీల్డ్ ప్రారంభం



మహీంద్రా స్పోర్ట్స్ ఫీల్డ్‌ను ప్రారంభిస్తున్న చాన్స్‌లర్ ఆనంద్ మహీంద్రా

సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లిలోని మహీంద్రా విశ్వవిద్యాలయంలో శుక్రవారం 'మహీంద్రా స్పోర్ట్స్ ఫీల్డ్' ఘనంగా ప్రారంభమైంది. మహీంద్రా విశ్వవిద్యాలయం చాన్సలర్ ఆనంద్ మహీంద్రా ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఎక్స్‌ట్రా కరికులర్ యాక్టివిటీస్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల జాతీయ స్థాయి పోటీల్లో రాణించిన పలువురు విద్యార్థులను ఆనంద్ మహీంద్ర అభినందించారు. ఈ కార్యక్రమంలో మహీంద్రా విశ్వవిద్యాలయం బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సభ్యులు సీపీ గుర్నానీ, వైస్ చాన్సలర్ డాక్టర్ యాజులు మెదురీ తదితరులు పాల్గొన్నారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'ది సైన్స్ ఆఫ్ స్లీప్' అనే అంశంపై ప్రముఖ లైఫ్ కోచ్, మెడిటేషన్ గైడ్ బి.కె. డాక్టర్ స్వామినాథన్ ఉపన్యాసం ఇస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

28న 'సంకల్ప్ దివాస్-2023

గచ్చిబౌలి: మాదాపూర్‌లోని శిల్పారామంలోని సాంప్రదాయవేదికపై ఈ నెల 28వ తేదీన 'సంకల్ప్‌దివాస్-2023' నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలలో ఒకటైన సుచిర్ ఇండియా సీఎస్ఆర్ విభాగమైన సుచిత ఇండియా ఫౌండేషన్ ఏర్పాటు చేసిన సంకల్ప్ కిరణ్ పురస్కార్ అవార్డు, మానవతావాది లయన్ డాక్టర్ వై కిరణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పద్మవిభూషణ్ మేరీకోమ్‌కు అవార్డు అందించి సత్కరిస్తామని సుచిర్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై కిరణ్ తెలిపారు.



కొలన్ హన్మంతరెడ్డిని సత్కరిస్తున్న అపురూపాకాలనీ అసోసియేషన్ సభ్యులు



కొలన్ హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఇందిరమ్మ కాలనీవాసులు



హన్మంతరెడ్డికి మద్దతు ప్రకటించిన కొంపల్లి గార్డెన్ సొసైటీ అపార్ట్‌మెంట్ వాసులు

ఇచ్చింది మేమే.. వచ్చేది మేమే

కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి



బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌లో ప్రచారం చేస్తున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి



కాంగ్రెస్ ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలు, అభిమానులు



గార్డెన్ సొసైటీ అపార్ట్‌మెంట్ వాసులతో సమావేశమైన కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని.. ఈ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేంది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒకటేనని... ఆ పార్టీ నేతల మాటలు నమ్మి మోసపోవద్దని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీతోనే బంగారు తెలంగాణ సాధ్యమని అన్నారు.

◆ భౌరంపేట్‌లోని త్రిపుర ల్యాండ్‌మార్క్-2 విల్లాస్‌లో శుక్రవారం హన్మంతరెడ్డి మార్నింగ్ వాక్ నిర్వహించి స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ, రోడ్ల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నిజాంపేట్ కార్పొరేషన్‌గా రూపాంతరం చెందినా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు అభివృద్ధి చేయడంతో ఘోరంగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే స్థానిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు

◆ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ కొలన్ హన్మంత్‌రెడ్డికి మద్దతుగా పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీనగర్‌లో పెద్ద పాదయాత్ర నిర్వహించారు.అభివృద్ధిని ఆకాంక్షించే ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుకు ఓటేసి హన్మంతరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూలకంటి లక్ష్మారెడ్డి, కుమార్‌యాదవ్, ప్రేమ్‌కుమార్, నరసింహ యాదవ్, నరసింహా రెడ్డి, ప్రవీణ్, బక్క రఘు, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ కొంపల్లి గార్డెన్ సొసైటీ అపార్ట్‌మెంట్ వాసులతో హన్మంతరెడ్డి సమావేశమయ్యారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్న కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలన్నారు. స్థానిక సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇవ్వగా స్థానికులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్యోత్స్నారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, సిరాజ్ హాజియాని, కరీం అజనీ), అమీన్ రౌజానీ, హుస్సేన్ మర్చంట్ తదితరులు పాల్గొన్నారు.

◆ బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీకి చెందిన మైసిగారి శ్రీనివాస్, కుమార్‌యాదవ్, రాహుల్ దుద్దుల ఆధ్వర్యంలో నాగరాజు, వెంకట్, ఉదయ్, సాయి, అక్షయ్, మోసిల్, సన్నీ, కురేశ్, విజయ్, సుమన్ తో పాటు వారి మిత్ర బృందం సభ్యులు కాంగ్రెస్ లో చేరగా కొలన్ హన్మంతరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

◆ సుబాష్‌నగర్ డివిజన్ అపురూప కాలనీ కమిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డికి కాలనీవాసులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు.

తులసీ కల్యాణం వైభోగమే..

కార్తీక మాసం పరిష్కరించుకొని చిలుక ఏకాదశి క్షీరాబ్ధి పూజ సందర్భంగా శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలుచోట్ల మహిళలు తులసీ కల్యాణం నిర్వహించారు. ఈ పూజ చేయడం వల్ల పసుపు కుంకుమలతో దీర్ఘ సుమంగళిగా ఉంటారని మహిళల నమ్మకం. – సుభాష్‌నగర్





చింతల్ డివిజన్‌లో ఎమ్మెల్యే వివేకానంద్‌కు స్వాగతం పలుకుతున్న స్థానికులు



ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలతో కరచాలనం చేస్తున్న వివేకానంద్

దశాబ్దాల సమస్యలు తీర్చిన నేత కేసీఆర్

- మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తాం
- కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి వివేకానంద్



గాజులరామారం డివిజన్‌లో వివేకానంద్‌కు బ్రహ్మరథం పడుతున్న ప్రజలు

కుత్బుల్లాపూర్: దశాబ్దాల నాటి కష్టాలను తొమ్మిదిన్నరేళ్లల్లో తీర్చిన నాయకుడు సీఎం కేసీఆర్ అని.. మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి సాధిస్తామని స్థానిక ఎమ్మెల్యే, కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కెపి వివేకానంద్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీలోని 11వ వార్డ్ గార్డెన్ సొసైటీ, 16వ వార్డ్ కౌన్సిలర్ చింతల రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో గంగస్థాన్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వివేకానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ స్వతంత్ర భారతంలో 75 ఏళ్లలో జాతీయ పార్టీలు చేయలేని అభివృద్ధిని సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదిన్నరేళ్లలో చేసి చూపించారన్నారు. కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు బూర్గుబావి హనుమంత రావు, కొంపల్లి మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జ్ దూదిమెట్ల సోమేష్ యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

◆ చింతల్ డివిజన్ హెచ్ఎంటి కాలనీలో జరిగిన సూర్యవంశ ఆరెకటిక సంఘం కుత్బుల్లాపూర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనభోజన కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో టి. అశోక్, పి. మనోజ్ కుమార్, సుభాష్, కే. అశోక్, సుభాష్, మోహన్, రాము, రాంజీ, జె. నరేష్, కే. రాంబాబు, ఏ. ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

◆ చింతల్ డివిజన్ ఎస్ఎల్‌బి నగర్, శ్రీనివాస్ నగర్, పద్మశాలి బస్తీ, వివేకానంద నగర్, రోడా మేస్త్రీ నగర్, వల్లభాయ్ పటేల్ నగర్ లలో నిర్వహించిన ప్రచారానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హాజరయ్యారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రషీదా బేగం, సీనియర్ నాయకులు, , మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

◆ గాజులరామారం డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ ఏ, బీ, సీ, ఎన్టీఆర్ నగర్ ఏ- బీ, బేకరీ గడ్డ, సుభాష్ చంద్రబోస్ నగర్ ఏ - బీ, రోడా మేస్త్రీనగర్ - బి, ఇందిరానగర్ ఏ - బి, చంద్రగిరి నగర్, అంబేద్కర్ నగర్, లెనిన్ నగర్, ఉమాదేవి నగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే వివేకానంద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో సమావేశమైన ఎమ్మెల్యే వివేకానంద్



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ చేరిన టీటీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సాయి తులసీ



కొంపల్లిలో స్థానికులతో వివేకానంద్

100 పడకల ఆస్పత్రిని నిర్మిస్తాం

- కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్
- ప్రచారానికి బ్రహ్మరథం పట్టిన ప్రజలు



జగద్గిరిగుట్టలో ఎన్నికల ప్రచారంలో బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్



బీజేపీ నాయకుడు కూన శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో పార్టీలో చేరుతున్న పలు పార్టీల నాయకులు



బహదూర్‌పల్లిలో జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు తీవ్ర అన్యాయం చేసిందని.. ఈ ప్రాంత ప్రజలకు కనీసం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సైతం ఇవ్వలేదని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ బీరప్పనగర్, మగ్దూమ్‌నగర్, పోలాల బస్తీ, రింగ్ బస్తీ, శ్రీనివాస్‌నగర్, భగత్‌సింగ్‌మార్గ్, సీసాల బస్తీ ప్రాంతాల్లో శ్రీశైలంగౌడ్ ఎన్నికల ప్రచారం నిర్వహించగా స్థానిక ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వ అధికారంలోకి రాగానే పేదలకు ఇళ్ల పట్టాలతో పాటు, జగద్గిరిగుట్టకు బస్ డిపో, జూనియర్ కాలేజ్, బస్తీ దావాఖానాలు ఏర్పాటు చేయిస్తానన్నారు. బస్తీలలో మౌలిక సౌకర్యాలు కల్పన కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కమలం గుర్తుపై ఓటేసి తనను ఆశీర్వదించాలని కోరారు.

◆ ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జీకే శేఖర్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు పున్నారెడ్డి, నాయకులు మేకల సురేష్‌రెడ్డి, అర్కల సుధా, మహేందర్, నరేష్‌గౌడ్, వసుంధర, గండి రాజు యాదవ్, సిద్ధిరామిరెడ్డి, మధు, అరుణారెడ్డి, శ్రవణ్, రాజమణి, గీత, పరశురామ్, ముప్పిడి రవి, స్థానిక బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మగ్దూమ్‌నగర్‌లో శ్రీశైలంగౌడ్ ప్రచారం

◆ జగదిరిగుట్ట రాజీవ్ గృహకల్పకు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీజేపీ సీనియర్ నాయకుడు కూన శ్రీనివాస్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జీకే శేఖర్ యాదవ్‌ల సమక్షంలో బీజేపీలో చేరారు. కుత్బుల్లాపూర్ అభివృద్ధి కూన శ్రీశైలంగౌడ్‌తోనే సాధ్యమని పలువురు పార్టీలో చేరుతున్నారని వారు పేర్కొన్నారు.

◆ దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్ పల్లి, ఇందిరమ్మకాలనీ, బౌరంపేట్‌లలో కూన శ్రీశైలంగౌడ్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. పేదలకు రేషన్ కార్డులు ఇప్పిస్తానన్నారు.కొంపల్లి నుంచి దూలపల్లి, బహదూర్ పల్లి వరకు రోడ్డు పనులను యుద్ధప్రాదిపకన పూర్తి చేస్తామన్నారు. నియోజకవర్గంలో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా 100పడకల ఆస్పత్రిని నిర్మిస్తామని అన్నారు.



ఇందిరమ్మ కాలనీలో శ్రీశైలంగౌడ్ రోడ్‌షోకు హాజరైన జనం



బీజేపీకి ఓటేయ్యాలని సీసాల బస్తీలో ఓ వృద్ధుడికి ఎన్నికల మేనిఫెస్టోను అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

సిద్దేంద్రయోగి ఆరాధనోత్సవాలు

మాదాపూర్: శిల్పారామంలో సిద్దేంద్రయోగి ఆరాధనోత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. భరతవేద ఆర్ట్స్ అసోసియేషన్ గురువు డాక్టర్ శ్రీనివాస వరప్రసాద్ శిష్యులతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత అచార్యులు డాక్టర్ భాగవతుల సేతురాం పాల్గొన్నారు. కళాకారులు నటేశకౌతం, జావళి, మూషికవాహన, రామాయణ శబ్దం, అన్నమాచార్య కీర్తనలు, రామదాసు కీర్తనలు తదితర అంశాలను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. కళాకారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.